కాంగ్రెస్ చేసిందేమీ లేదు

- పదకొండు నెలల్లో పంచాయతీలు, మున్సిపాలిటీలకు రూపాయి కూడా ఇవ్వలే
- కేంద్రసహాయ మంత్రి బండి సంజయ్
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభం

గంభీరావుపేటలో వంతెనను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

గంభీరావుపేట/ వేములవాడ రూరల్ నవంబర్ 23: కాంగ్రెస్ ప్రభుత్వం పదకొండు నెలల పాలనలో చేసిందేమీ లేదని, పంచాయతీలు, మున్సిపాలిటీలకు ఒక్కరూపాయి నిధులు కేటాయించలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం గంభీరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. లింగన్నపేట-కోరుట్లపేట మధ్య రూ.15 కోట్లతో నిర్మించిన డబుల్ రోడ్డును, గంభీరావుపేట-మల్లారెడ్డిపేట మధ్యన మానేరు వాగుపై రూ. 8 కోట్ల 60 లక్షలతో నిర్మించిన వంతెనను ప్రారంభించారు. అనంతరం మల్లారెడ్డిపేటలో వీరాంజనేయస్వామి, మండల కేంద్రంలో ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే వేములవాడ మండలం సంకెపల్లిలో రూ.15 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమాదేవి, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్, మాజీ ఎంపీటీసీ బుర్ర లహరిశేఖర్, మండలాధ్యక్షులు వెంకటేశ్వర్లు, గంట అశోక్, మాజీ ఎంపీపీ బండ మల్లేశం, నాయకులున్నారు.

డాటా ఎంట్రీపై మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ పూర్తి

కలెక్టరేట్, నవంబర్ 23: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసేందుకు మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ పూర్తి చేశామని అదనపు కలెక్టర్ భీమ్యా నాయక్ తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లాలోని 28 మంది మాస్టర్ ట్రైనర్లకు ఆన్‌లైన్ డాటా నమోదుపై జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారితో కలిసి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండలానికి ఇద్దరు, ప్రతి మున్సిపాలిటీకి నలుగురు చొప్పున మొత్తం 28 మంది మాస్టర్ ట్రైయినీలకు శిక్షణ పూర్తి చేశామన్నారు. వారు మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో 480 మంది ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారని, శనివారం నుంచే డాటా ఎంట్రీ ప్రారంభమైందని వెల్లడించారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

వేములవాడ టౌన్, నవంబర్ 23 : క్షేత్రపర్యటనలో భాగంగా పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రీ ప్రైమరీ విద్యార్థులు స్థానిక పోస్టాఫీసును సందర్శించారు. వివిధ విభాగాల్లో పనిచేసే ఉద్యోగస్తులను కలిసి, లావాదేవీలు గురించి పోస్ట్ మాస్టర్ రఘుమోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాజు, పుల్లూరి రాజేందర్, కావ్య, పాఠశాల కరస్పాండెంట్ సన్నిధి వెంకటకృష్ణ, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

ఫిర్యాదులపై జాప్యం చేయొద్దు

తంగళ్లపల్లి స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్
- తంగళ్లపల్లి ఠాణాలో తనిఖీ

సిరిసిల్ల రూరల్, నవంబర్ 23: పోలీస్‌స్టేషన్లకు వచ్చే ప్రజా ఫిర్యాదులపై జాప్యం చేయొద్దని, తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. శనివారం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో తనిఖీ చేసి, మాట్లాడారు. డయల్ 100కి వచ్చిన కాల్స్‌పై బ్లూకోల్ట్, పెట్రోకార్ సిబ్బంది తక్షణమే స్పందిస్తూ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. పెట్రోలింగ్ సమయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్ల కదలికలను ప్రతి రోజూ తెలుసుకోవాలని సూచించారు. గ్రామాల్లో సీసీ టీవీల ఏర్పాటుపై దృష్టిసారించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అధికారులు, విలేజ్ పోలీస్ అధికారులు తరచూ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతూ చట్టాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఇక్కడ సీఐ మొగిలి, ఎస్ఐ రామ్మోహన్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

తెలంగాణ చౌక్, నవంబర్ 23: సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలు చూసి ప్రజలు మోసపోవద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. గత వారం రోజుల్లో జిల్లాలో జరిగిన సైబర్ నేరాల వివరాలను శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సైబర్ నేరగాళ్లు ఆశ, భయం అనే రెండు అంశాలపై ఫోకస్ చేస్తూ నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. లోన్ యాప్, లాటరీ, పార్ట్‌టైమ్ జాబ్, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం, పింక్ వాట్సాప్ పేరుతో మెసేజ్‌లు రాగానే ఆశపడి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మనం ఫోన్ వాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, మీ ప్రమేయం లేకుండా ఓటీపీ వస్తే దాన్ని ఎవరికీ చెప్పకుండా ఉండాలని, అది సైబర్ నేరగాళ్లు ఎత్తుగడగా భావించాలని సూచించారు. సామాజిక మాధ్యమాలు, సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం అందుబాటులో ఉంచకూడదని పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930కి కాల్ చేస్తే పోగొట్టుకున్న డబ్బులు తిరిగి పొందే అవకాశం ఉంటుందని చెప్పారు.

కుల గణనలో వ్యక్తిగత అంశాలెందుకు?

- కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు
- సర్వేకు సహకారం.. పలు అంశాలపై సమాచారం ఇచ్చేందుకు నిరాకరణ

రవీందర్‌రావు వివరాలు సేకరిస్తున్న ఎన్యుమరేటర్

గంభీరావుపేట, నవంబర్ 23: ప్రభుత్వం కులగణన సర్వే పేరిట అనవసర వివరాలు సేకరిస్తున్నదని, వ్యక్తిగత అంశాలు ఎందుకు అని కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు ప్రశ్నించారు. మండలంలోని గజసింగవరంలో శనివారం తన నివాసానికి సర్వే నిమిత్తం వచ్చిన ఎన్యుమరేటర్‌కు తన కులం, కుటుంబ సభ్యులు, ఫోన్ నంబర్ల వివరాలు మాత్రమే అందించానని, వ్యక్తిగతమైన మిగతా 52 అంశాలను నిరాకరించానని కొండూరి తెలిపారు. తాను అందించిన 3 అంశాల వివరాలు కుల గణన సర్వేకు సరిపోతాయని చెప్పారు.

కొండూరి పరామర్శ

గంభీరావుపేట, నవంబర్ 23: మండల కేంద్రంలో పలు బాధిత కుటుంబాలను కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు శనివారం పరామర్శించారు. ముస్తాఫానగర్‌లో శేరిపల్లి సాగర్ తండ్రి బాలరాజు, మండల కేంద్రంలో లింబయ్యగారి శ్రీనివాస్‌రెడ్డి తల్లి సత్తవ్వ, నేవూరి మైసిరెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి, నేవూరి రాజురెడ్డి తండ్రి మైసిరెడ్డి, గాధం శ్రీనివాస్ తండ్రి రాములు, ఈరవేని కృష్ణ తండ్రి గంగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను కొండూరి పరామర్శించారు. ఆయన వెంట సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామిగౌడ్, మాజీ ఎంపీటీసీలు కొమిరిశెట్టి లక్ష్మణ్, లక్కిరెడ్డి కమలాకర్‌రెడ్డి, ఎగదండి స్వామి, నేతలు శివరాత్రి నర్సింహులు, వెంకటేష్‌గౌడ్, నర్సింగరావు, చిట్టంపల్లి బిక్షపతి తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆర్ఎస్ ప్రవీణ్ బర్త్‌డే వేడుకలు

కేక్ కట్‌చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బోయినపల్లి, నవంబరు 23: బోయినపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. 'బీఆర్ఎస్ జిందాబాద్' అంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కొండయ్య, నియోజకవర్గ నాయకులు కొంకటి శేఖర్, నాయకులు శంకర్, మాజీ వైస్ ఎంపీపీ నాగయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యానారయణరెడ్డి, నాయకులు శంకర్, రమేశ్, సంజీవ్, రాజు, సుధాకర్ ఉన్నారు.

ఉత్తమ ఫలితాలకు కృషి చేయాలి

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 23: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు రావడానికి అధ్యాపకులు కృషి చేయాలని ఇంటర్మీడియట్ అధికారి శ్రీనివాస్ సూచించారు. శనివారం కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున ప్రత్యేక తరగతులు తీసుకునేందుకు చొరవ చూపాలని తెలిపారు. ఇక్కడ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ క్యాతం సత్యనారాయణ, అధ్యాపకులు ఉన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే జైలు

వేములవాడ/వేములవాడరూరల్, నవంబర్ 23: వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన పలువురికి వేములవాడ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి జైలుశిక్ష విధించినట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాలమేరకు ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ చేయగా, 24 మంది పట్టుబడ్డట్లు చెప్పారు. వారిని శనివారం వేములవాడ కోర్టులో ప్రవేశపెట్టగా, ముగ్గురికి ఒక రోజు జైలు శిక్ష రూ.వెయ్యి జరిమానా, ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్ష. రూ.1500 జరిమానా, 19 మందికి ఒక్కొక్కరికి రూ.1500 జరిమాన విధించారని తెలిపారు. వేములవాడ మండల పరిధిలో ఇటీవల డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 10 మందికి వేములవాడ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జైలు శిక్ష విధించినట్లు రూరల్ ఎస్ఐ మారుతి పేర్కొన్నారు. ముగ్గురికి ఒక రోజు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమాన, ఏడుగురికి ఒక్కొక్కరికి రూ.1500 చొప్పున జరిమాన విధించినట్లు పేర్కొన్నారు.

రుద్రంగి ఎస్ఐకి మూడు రివార్డులు

రుద్రంగి, నవంబర్ 23: రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో ఉత్తమ ఇన్వెస్టిగేషన్ చేసి నిందితులను అరెస్టు చేసి శిక్ష పడేలా కృషి చేసిన రుద్రంగి ఎస్ఐ అశోక్‌కు మూడు రివార్డులు వచ్చాయి. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో డీజీపీ జితేందర్ ఎస్ఐ అశోక్‌కు మూడు ప్రశంస పత్రాలు, రివార్డులు అందించారు. రుద్రంగి ఠాణా పరిధిలో గంజాయి కేసుల్లో నిందితులను అరెస్టు చేసి శిక్ష పడేలా కృషి చేసినందుకు ప్రశంస పత్రాలు, రివార్డులు వచించినట్లు ఎస్ఐ తెలిపారు.

సింహగర్జనను విజయవంతం చేయాలి

సిరిసిల్ల టౌన్, నవంబర్ 23: వచ్చే నెల 1న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని లహరి కల్యాణ మండపంలో జరిగిన మాల-మాల ఉపకులాల ఆత్మగౌరవ సభకు ముఖ్యఅతిథిగా వచ్చి, మాట్లాడారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఏబీసీడీ వర్గీకరణ తీర్పులో కుల వివక్ష ఉన్నదన్నారు. మాలలను అన్ని రాజకీయ పార్టీలు చిన్నచూపు చూస్తున్నాయని పేర్కొన్నారు. మాజీ మంత్రి సుద్దాల దేవయ్య మాట్లాడుతూ మాలల హక్కుల కోసం చేసిన పోరాటంలో తన మంత్రి పదవిని సైతం కోల్పోయానని గుర్తు చేశారు. ఇక్కడ మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు రాగుల రాములు, మాజీ డీఎస్పీ దామెర నర్సయ్య ఉన్నారు.

బాల్య మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఇల్లంతకుంట, నవంబర్ 23 : కందికట్కూర్ గ్రామానికి చెందిన సావనపెల్లి స్వామి రెండు నెలల క్రితరం అనారోగ్యంతో మృతిచెందగా, అతని కుటుంబానికి 10వ తరగతి బ్యాచ్ మిత్రులు అండగా నిలిచారు. అందరు కలిసి రూ.20వేలు పోగు చేసుకొని శనివారం స్వామి పిల్లల పేరు మీద సుకన్య సమృద్ధి యోజనలో ఫిక్స్ డిపాజిట్ చేసి బాండ్ పేపర్లను అందజేశారు. చిన్న నాటి మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన అనిల్, శ్రావన్, విష్ణు, యాదగిరి, మారితి, పరుశరాంను గ్రామస్తులు అభినందించారు.

సిరిసిల్లకు ఆర్‌వీఎం ఆర్డర్లు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): సిరిసిల్లకు ఆర్‌వీఎం వస్త్ర ఉత్పత్తుల ఆర్డర్లను ప్రభుత్వం ఇచ్చింది. మొత్తం 66లక్షల మీటర్లు స్కూల్ యూనిఫాంల తయారీ కోసం శనివారం ఆర్డర్లు వచ్చినట్లు టెస్కో అధికారులు తెలిపారు. 128 మాస్ సొసైటీలకు ఇచ్చిన ఆర్డర్లతో దాదాపు వెయ్యి మంది కార్మికులకు నెల రోజుల ఉపాధి లభించనున్నది.

రాజన్న క్షేత్రంలో హంపీ పీఠాధిపతి

హంపీ పీఠాధిపతికి ప్రసాదాన్ని అందజేస్తున్న ప్రభుత్వ విప్

వేములవాడ టౌన్, నవంబర్ 23 : వేములవాడ రాజన్నను శనివారం హంపీ పీఠాధిపతి శ్రీ విరూపాక్ష విద్యారణ్యస్వామి దర్శించుకున్నారు. ఆలయంలో వారికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఈవో వినోద్‌రెడ్డి, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అద్దాలమండపంలో ఆయనకు అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేయగా, విప్ శ్రీనివాస్ స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

గంజాయి విక్రేత అరెస్ట్

ఇల్లంతకుంట, నవంబర్ 23: ముస్కానిపేట శివారులో గంజాయి విక్రయిస్తున్న మహమ్మద్ ఆల్ఫాహేద్ (24)ను శనివారం అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ మొగిలి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుండారం గ్రామానికి చెందిన మహమ్మద్ ఆల్ఫాహేద్ గంజాయికి అలవాటు పడ్డాడు. అతను సేవించడంతోపాటు విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు తనిఖీలు చేస్తుండగా, ముస్కానిపేట శివారులో అరెస్ట్ చేసి, 110 గ్రాముల గంజాయి, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

నేతన్నల సమస్యలు పరిష్కరించాలి

టెస్కో జీఎం అశోక్‌రావుకు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): మరమగ్గాల కార్మికుల పరిష్కారం కోసం సీఐటీయూ నాయకులు శనివారం హైదరాబాద్‌లో టెస్కో జీఎం అశోక్‌రావును కలిశారు. తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగుమంటి ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. 2022, 2023 సంవత్సరంలో కార్మికులకు రావాల్సిన పదిశాతం యారన్ సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని, నేతన్నలకు చేతి నిండా పనికల్పించేలా ఆర్డర్లు ఇవ్వాలని కోరినట్లు వారు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
BUSINESS OFFER
★సిబిల్ స్కోర్ పెంచబడును ఇంటి పై లోన్ / ఓపెన్ ప్లాట్ లోన్ / బిజినెస్ లోన్/పర్సనల్ లోన్ సంప్రదించండి: పెద్దపల్లి సెల్: 9346756075
NTK-325450

జన్మదినం మార్పు

తునుకుల ప్రవణ్‌కుమార్ S/o. తునుకుల సారయ్య గ్రా॥ చెల్పూర్, మం॥ హుజురాబాద్ , జి॥కరీంనగర్ ఆధార్ నెం॥ 870696883656, వృత్తి: ఆర్మి సైనికుడు నెం॥ 15808315M, ర్యాంక్ L/NK, 23, Rastriya Rifilas (unit 145 ad Regiment (SP) Army Air Defence) నాయొక్క 01-07-1976, 01-06-1966, తల్లిదండ్రుల జన్మదినం సర్వీస్ బుక్‌లో తప్పుగా నమోదు కాబడినవి. ఆదార్ కార్డు ప్రకారం తల్లి తునుకుల మణేమ్మ జన్మదినం 01-01-1976 మరియు తండ్రి తునుకుల సారయ్య ఆధార్ కార్డు ప్రకారం జన్మదినం 01-01-1966 సరియైనవి.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

నాడు తండ్రి.. నేడు తల్లి మృతి

- అనాథగా మారిన చిన్నారి
- నిమ్మపల్లిలో విషాదం

నవ్యశ్రీ

కోనరావుపేట, నవంబర్ 23: విధి వెంటాడింది. అనారోగ్యం రూపంలో పేద కుటుంబాన్ని పగబట్టింది. నాడు తండ్రి, నేడు తల్లి మృతిచెందడంతో చిన్నారి అనాథగా మారింది. ఈ విషాదకర ఘటన కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఇస్లావత్ భారతి, భాస్కర్ దంపతులకు కూతురు నవ్యశ్రీ ఉంది. సంతోషంగా సాగిపోతున్న వీరి జీవితంలో భాస్కర్‌ను విధి వెంటాడింది. అనారోగ్యం బారిన పడి వైద్యం చేయించుకోలేక గతంలోనే మృతిచెందాడు. భారతి కూలీ పనిచేసుకుంటూ కూతురును కోనరావుపేట మోడల్ స్కూల్‌లో చదివిస్తున్నది. భారతి కూడా అనారోగ్యంబారిన పడి, చికిత్స కోసం పలు దవాఖానలు తిరిగింది. శనివారం తీవ్ర అస్వస్థతకు గురై ఇంటి వద్దే మృతిచెందింది. చిన్నారి ఒంటరై పోయింది. తల్లి మృతదేహంపై పడి 'అమ్మా, లే.. అమ్మా' అంటూ చిన్నారి రోదించిన తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది. నవ్యశ్రీని ప్రభుత్వం, విప్ ఆది శ్రీనివాస్ ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గొల్లపల్లి రైస్‌మిల్లులో తనిఖీ

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 23: గొల్లపల్లిలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్, శ్రీ రాజరాజేశ్వర ఇండస్ట్రీస్ పేరుతో నిర్వహిస్తున్న పారాబాయిల్డ్ రైస్‌మిల్లులో ఇండస్ట్రీస్ ఏడీ భారతి శనివారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. రెండు రైస్‌మిల్లులకు సంబంధించిన వ్యర్థపు నీటి కోసం మిల్లుల ఆవరణలో తవ్విన పెద్ద బావుల ద్వారా తమ పొలం భవిష్యత్తులో పనికి రాకుండా పోతుందని పేర్కొంటూ అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువ రైతులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. నాలుగు రోజుల క్రితం ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ భిక్షపతి, అధికారులు వ్యర్థపు నీటి శాంపుల్లను పరీక్షల కోసం తీసుకెళ్లారు. తాజాగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇండస్ట్రీస్ ఏడీ భారతి వచ్చి రైస్‌మిల్లర్స్ ప్రతినిధులు, ఫిర్యాదు దారులను కలిసి సమస్యపై వివరాలు సేకరించారు.

సమస్యలు పరిష్కరించాలి

వీర్నపల్లి, నవంబర్ 23: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలోని మండల వనరుల కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ధర్నా చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను విడుదల చేయాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే వచ్చే నెల 10, 11 తేదీల్లో కార్మికులు టోకెన్ సమ్మెకు వెళ్తున్నామని తెలిపారు. ఇక్కడ లక్ష్మీనర్సవ్వ, గంగవ్వ, భాగ్య, లత, విజయ, సరోజన, నిర్మల, రజిత ఉన్నారు.

పుట్టిన ఊరుకు సేవ చేయడం అదృష్టం

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 23: పుట్టిన ఊరికి సేవ చేయడం అదృష్టంగా భావించాలని నారాయణపూర్ సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. శనివారం నారాయణపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జేఎస్‌డబ్ల్యూ సహకారంతో నిర్మించిన అదనపు తరగతి గదిని ప్రారంభించి, మాట్లాడారు. పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వారికి నగదు పారితోషికం ఇస్తామని, ప్రతిభ ఉన్న పేద విద్యార్థులకు నెలకు రూ.వెయ్యి చొప్పున అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు కూర్చునేందుకు సంస్థ సభ్యుడు దుబ్బ విశ్వనాథం కార్పెట్‌ను వితరణ చేశారు. ఇక్కడ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ టీ. భాగ్యమ్మ, సేవా సమితి అధ్యక్షుడు మోతె దేవిరెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం మనోహరాచారి, సంస్థ సభ్యులు పాత లింగయ్య, సుదర్శన్, తిరుపతి, నారాయణరెడ్డి, కిషన్‌రావు, హెచ్ఎం చంద్రశేఖర్ ఉన్నారు.

ఆన్‌లైన్ ఎంట్రీని పకడ్బందీగా చేయాలి

రుద్రంగి, నవంబర్ 23: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా సేకరించిన డాటా ఆన్‌లైన్ ఎంట్రీని పకడ్బందీగా నిర్వహించాలని తాసీల్దార్ శ్రీలత సూచించారు. సోమవారం రుద్రంగిలోని తాసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్ ఎంట్రీపై సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఇక్కడ డిప్యూటీ తాసీల్దార్ యాదగిరి, ఆర్ఐ నవీన్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి నిరంతరం కృషి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- దేవుని తండాలో ఎల్లంపల్లి కుడి కాలువ పనులు ప్రారంభం

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ శ్రీనివాస్

చందుర్తి, నవంబర్ 23: అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సనుగుల గ్రామంలోని దేవుని తండాలో మిగిలిన ఎల్లంపల్లి కుడి కాలువ పనులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎల్లంపల్లి కుడి కాలువ రుద్రంగి పాయింట్ నుంచి నీటిని సనుగుల గ్రామంలోని ఎర్రచెరువు పటేల్ చెరువుకు తీసుకొచ్చి, ఇక్కడి నుంచి లచ్చపేట తండా రిజర్వాయర్‌కు జలకళ తెస్తామని, ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని చెప్పారు. అనంతరం గ్రామంలోని గోవిందరాజుల స్వామివారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చింతపటి రామస్వామి ఉన్నారు.

బోధనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



గణిత బోధన చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

గంభీరావుపేట, నవంబర్ 23: ప్రభుత్వ పాఠశాలల్లో బోధనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలని ఉపాధ్యాయులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. మండల కేంద్రంలోని కేజీ టూ పీజీ విద్యాలయంతో పాటు దమ్మన్నపేట ఆదర్శ పాఠశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పలు అంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టిన కలెక్టర్, పలు పాఠ్యాంశాలను బోధించారు. విద్యార్థుల హాజరు శాతంపై ఆరా తీశారు. మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లిష్ అంశాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనానికి సంబంధించి కూరగాయలు, నిత్యావసర సరుకులు, బియ్యాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట జిల్లా విద్యాధికారి రమేశ్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఉన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ముస్తాబాద్/బోయినపల్లి, నవంబర్ 23: ముస్తాబాద్ మండలం నామాపూర్ శివారులో శనివారం రాత్రి రెండు ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గణేశ్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన చదువుల భాస్కర్ ఆటోలో ఐదు క్వింటాళ్ల బియ్యం, ఆవునూరు గ్రామానికి చెందిన అనరాశి రాజేశ్ మరో ఆటోలో ఏడు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా నామాపూర్ శివారులో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెల